క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పే రివిజన్ కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం ఇంటిరియం రిలీఫ్ వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం పెదకూరపాడు, అమరావతి మండలాల కమిటీలు తీర్మానం చేశాది. బుధవారం అమరావతి పెన్షనర్స్ సంఘం కార్యాలయం లో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షులు ఎస్.నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు బకాయి ఉన్న నాలుగు డి ఏ లు వెంటనే చెల్లించాలని దసరా కు కనీసం ఒక డీఏ అయినా ఇవ్వాలన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వై.సుబ్బారావు, సంఘ మాజీ అధ్యక్షులు గుంటుపల్లి కోటేశ్వరరావు, వి. శర్మ భాస్కర రెడ్డి, బి.శివరామయ్య, వీరయ్య, అమీర్ ఖాదర్, జె.లక్ష్మీనారాయణ, రాయప్ప, హనుమంతరావు, ప్రఫుల్లరాణి, అప్పారావు, ఇందిరా కుమారి పాల్గొన్నారు.

25 పశువుల షెడ్లు మంజూరు

క్రోసూరు: ఉపాధి పథకం కింద మంజూరైన పశువులషెడ్లు పశు పోషణకు ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడతాయని ఎంపీడీఓ జి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అందుకూరులో ఇద్దరు పశుపోషకుల కు షెడ్లు మంజూరు కాగా వాటికి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వరరావు, ఈసీ రమణ మూర్తి, టీఏ వెంటస్వామి, వెటర్నరీ డాక్టర్ షేక్ బషీర్, వెంకట్రావు పాల్గొన్నారు.

విశిష్ట ప్రయోజనాలనిచ్చే గోవులను రక్షించుకుందాం!

అచ్చంపేట: సమాజానికి విశిష్ట ప్రయోజనాల నిచ్చే గోవులను రక్షించుకునేందుకు నడుం బిగించాలని విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖులు తుమ్మా మల్రెడ్డి అన్నారు. మండలంలోని వేల్పూరు శివాలయంలో బుధవారం ఆయన గ్రామ గోరక్షా కమిటిని ఏర్పాటుచేశారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సునీత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 26 ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం చంద్రాజుపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

తల్లులు ఆరోగ్యంగా ఉండాలి

రాజుపాలెం: తల్లి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని డాక్టర్ పొలు రవి తెలిపారు. మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-2లో మహిళలకు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ 169 మంది మహిళలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వసంతరావు, ఉషారాణి, ఎమ్‌ఎల్‌హెచ్‌పి అలేఖ్య పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

సత్తెనపల్లి: పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన తాగునీటినే తాగాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందరావు బుధవారం అన్నారు. పట్టణంలోని 31 వార్డుల్లో రక్షిత నీటి సరఫరా ద్వారా ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వర్షా కాలం దృష్ట్యా ప్రజలు తాగునీటిని కాచి వడపోసి తాగాలన్నారు. మంచినీరు ఎక్కడైనా అనివార్య కారణాల వలన కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తే వెంటనే పురపాలక సంఘంలోని సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు తాగునీటి విషయంలో అశ్రద్ధ చేయకుండా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

బ్లాక్ బర్లీ సాగు చేస్తే చర్యలు

సత్తెనపల్లి: బ్లాక్ బర్లీ పొగాకు నారు సాగు చేసేటటువంటి రైతులపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి బుధవారం అన్నారు. సత్తెనపల్లి మండలంలోని రైతు సేవ కేంద్రాల సిబ్బంది ద్వారా ప్రతి గ్రామంలో బ్లాక్ బర్లీ పొగాకు సాగుపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగును, నర్సరీలను సాగు చేయటం నిషేధించినట్లు చెప్పారు. ఒకవేళ నల్ల బర్లీ పొగాకు సాగును చేసినట్లు అయితే పంటను దున్నివేసి తీసివేయడం జరుగుతుందన్నారు. వైట్‌బర్లీ పొగాకును సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆయా సంస్థల నుండి అగ్రిమెంట్ బాండ్లను పొందాల్సి ఉందని చెప్పారు. ఆ బాండ్ల యొక్క జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా మండల వ్యవసాయ అధికారికి అందజేయాలన్నారు.

నల్లబర్లి పొగాకు సాగు నిషేధం

ముప్పాళ్ల: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర మండలంలోని రైతులు నల్లబర్లి పొగాకు సాగు చేయటం నిషేధమని, రైతులు ఎవరూ సాగు చేయరాదని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. మండలస్థాయి అధికారుల బృందం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మండల స్థాయి బృందం సభ్యులైన తహసీల్దార్ కె.నగేష్, వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ వి.సోమేశ్వరరావు మాట్లాడుతూ నల్లబర్లి పొగాకు ఎవరైనా సాగు చేస్తే దున్ని వేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

అచ్చంపేట: తల్లిపాలు అమృతం లాంటివని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం తెలిపారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మండలంలోని చామర్రులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలలో పోషక గుణాలు ఎక్కువగా ఉంటాయన్నారు. బిడ్డ ఎదుగుదలకు అవి దోహదపడాతాయని, వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని చెప్పారు. ప్రతి తల్లి తమ బిడ్డలకు పాలివ్వాలన్నారు.


సత్తెనపల్లి.. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


సత్తెనపల్లి.. సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో...


సత్తెనపల్లి.. వెంకటపతికాలనీలో..


సత్తెనపల్లి.. వడ్డవల్లి పెద్దబొడ్డురాయి వద్ద అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


సత్తెనపల్లి.. కొత్తపేట మహలక్ష్మమ్మ చెట్టు వద్ద అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


పెదమక్కెన.. మల్లికార్జునస్వామి దేవాలయంలో..

అన్నపూర్ణాదేవి నమోస్తుతే

- అన్నపూర్ణ అలంకరణలో జగన్మాత
- భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు

సత్తెనపల్లి: శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మూడో రోజు అయిన బుధవారం సకల జీవకోటికి ఆహారాన్ని అందించే అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి భక్తిశ్రద్ధలతో విశేష సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, త్రిశక్తి దుర్గాపీఠం, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని లక్ష్మీప్రత్యంగిరా అమ్మవారి పీఠం, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదర సంఘ రామాలయం వద్ద, వడ్డవల్లి పెద్దబొడ్డురాయిసెంటర్‌లో, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద, వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

అచ్చంపేట: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు లలితాదేవిగా దర్శనమిచ్చారు.

ముప్పాళ్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని చాగంటివారిపాలెంలోని పైడమ్మతల్లి వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

క్రోసూరు: దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని అమ్మవారు వివిధ దూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. క్రోసూరులో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవీగా, అనంతవరంలో కల్యాణవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గాయత్రీదేవీగా భక్తులకు దర్శమిచ్చారు. మహిళలు ఆశేషంగా పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

బెల్లంకొండ: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ పీఠంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూడవ రూపం అన్నపూర్ణాదేవి అవతారమని శతాధిక ప్రతిష్టాచార్య పులుపుల వేంకట ఫణికుమార శర్మ తెలిపారు. ఆయనతో పాటు పలువురు వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో దుర్గా మాత ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి శివాలయంలో దేవీనవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారీ కోనూరి శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. మండలకేంద్రంలోని అంకమ్మతల్లి దేవాలయంలో దేవీనవరాత్రుల సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు. అంకమ్మతల్లి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వచ్చిన భక్తులకు ఫణిశర్మ తీర్థప్రసాదాలను అందించారు.


అచ్చంపేటలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకారంలో దర్శనం


చాగంటివారిపాలెంలో అన్నపూర్ణదేవి అలంకారం


అనంతవరంలో గాయత్రీదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు


బెల్లంకొండలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


బ్రాహ్మణపల్లి శివాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


రాజుపాలెం అంకమ్మతల్లి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనం

వర్షాలతో పత్తి రైతు బెంబేలు

- ఈ ఏడాది అధికంగా సాగు
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు

క్రోసూరు: వర్షాలకు పత్తి రైతు అవస్థలు పడుతున్నాడు. ప్రతి రోజు వర్షం కురుస్తుండడంతో పత్తి పంటకు చేటు తెచ్చే విధంగా ఉంది. ఈ ఖరీఫ్‌లో అధిక శాతం పత్తి సాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం సాగు 10,588 ఎకరాల్లో ఉండగా, అందులో పత్తి 8,804 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వరి 1,086 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, మిర్చి 559 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు.


మండలంలో పత్తి పంటలు

వెంటాడుతున్న వర్షాలు..

రైతులను వర్షాలు వెంటాడుతున్నాయి. దీనికి తోడు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొరత ఉంది. వారం రోజులుగా ప్రతి రోజు రాత్రి సమయాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పత్తి పొలాలకు అధిక వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తాయని రైతులు వాపోతున్నారు. పత్తి సాగు చేసేందుకు ఎకరాకు సుమారు రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలు ఇలా...

వ్యవసాయధికారులు అధిక వర్షాల సమయంలో పత్తి సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు సూచనలు చేస్తున్నారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా పడుతూ, చేలల్లో నీరు నిలిచినట్లయితే, ఆ నీటిని వీలైనంత త్వరగా పొలం నుంచి తీసివేయాలి. పైరు పెరుగుదలకు దోహదపడే విధంగా ఎరువులను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా మొక్కల మధ్య అంతర సేద్యం చేయడం వలన తేమ ఆరిపోయి, మొక్కలు త్వరగా కోలుకుంటాయి. వాతావరణంలో అధిక తేమ ఉండడం వలన, తెగుళ్ల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున, లీటర్ నీటికి ప్రొపికొనజోల్ 1మి.లీ(లేదా) కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలని. వర్షాలు పడుతున్నందువల్ల కలుపు సమస్యను అధిగమించడానికి మనుషుల చేతగాని(లేదా) గొర్రు, గుంటకలతో గాని కలుపును నివారించాలి. విత్తిన 20-25 రోజులకు గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో క్విజలో ఫాప్ ఇథైల్ మందును 400 మి.లీ. చొప్పున, వెడల్పాటి ఆకులు గల కలుపు మొక్కల నివారణకు పైరితయోబ్యాక్ సోడియం మందును 250 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పత్తి ఎనిమిది ఎకరాల్లో సాగు చేశా



పత్తి ఎనిమిది ఎకరాల్లో సాగు చేశా. నానా తిప్పలు పడి ఎరువులు సాధించుకున్నమని అనుకుంటుంటే వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. దీంతో పత్తి పంట ఏమవుతుందో అని అందోళనగా ఉంది.

–విప్పల రాజశేఖరరెడ్డి, పీసపాడు

వర్షాలు వదలడం లేదు..



నేను ఈ ఏడాది పత్తి ఎనిమిది ఎకరాలు, మిర్చి మూడు ఎకరాలు వేశా. ఈ వర్షాలు వదిలిపెట్టటం లేదు. గిట్టుబాటుధరలు లేకపోయినా ప్రతి ఏటా ఆశతో రైతు సాగు చేయక తప్పటం లేదు. పెట్టుబడులు ఏటికాయేడు పెరుగుతునే ఉన్నాయి. పంట చేతి వచ్చే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నా.

– విప్పల నరసింహారెడ్డి, పీసపాడు


గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొన్నారు.

– సాక్షి నెట్ వర్క్

నివేశనా స్థలాలు లబ్ధిదారులకు అందించాలి


నిరసన తెలుపుతున్న బాలాజీనగర్‌తండా వాసులు

నకరికల్లు: ప్రభుత్వం ద్వారా హక్కులు పొందిన పేదల నివేశనా స్థలాలను ఆక్రమణదారుని చెర నుంచి విడిపించి లబ్ధిదారులకు ఇప్పించాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. లబ్ధిదారుల స్థలాన్ని ఇప్పించాలంటూ తహసీల్దార్ కె.ప్ల్లారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989లో అప్పటి ప్రభుత్వ హయాంలో మండలంలోని బాలాజీనగర్ తండాలోని బంజారా తెగకు చెందిన 37 కుటుంబాల్లోని పేదలకు గ్రామంలోని గ్రామకంఠం నంబర్ 666లో గల 1.25 ఎకరాలలో 37 కుటుంబాలకు నివేశనాస్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాటి నుంచి గుడిసెలు వేసుకొని లబ్ధిదారులు నివాసముంటుండగా బాలాజీనగర్‌తండాకు చెందిన కాట్రావత్ సాంబయ్య నాయక్, అధికారపార్టీ అండతో సదరు స్థలాన్ని ఆక్రమించి గుడిసెలను బలవంతంగా తొలగించి లబ్ధిదారులను నిరాశ్రయులను చేశాడని ఆరోపించారు. 666-2బీ2 సర్వేనంబర్‌లో 1.13 ఎకరాల భూమి తనకున్నట్లు ఉత్తర్వులు ఉన్నప్పటికీ దానిని వదిలేసి 666 సర్వే నంబర్‌లోని పేదలకు పట్టాలిచ్చిన స్థలం తనదంటూ ఆక్రమణకు పాల్పడుతున్నాడని అన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, వి.రవినాయక్, ఆర్.రామునాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, సీపీఎం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, గిరిజనసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, మాలమహానాడు సోషల్‌మీడియా ఇన్‌చార్జి గోదా బాల, ఎంసీపీఐయు జిల్లా మహిళాకార్యదర్శి గాదె కుమారి, సీపీఐ నాయకుడు టి.మణికంఠ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ బాధితుడికి న్యాయం చేయాలి

విదుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మంచాన పడిన సాగర్‌బాబుకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. మండలంలోని చేజర్లలో 13 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్న సాగర్‌బాబును అన్ని విధాలా ఆదుకోవాలని విన్నవించారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'


సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శనలోని సన్నివేశం

సత్తెనపల్లి: కొందరి కోసం కాదు.. అందరి కోసం అంబేడ్కర్ అని పల్నాడు జిల్లా సత్తెనపల్లి లూథరన్ చర్చి ప్రాంగణంలో అభ్యుదయ ఆర్ట్స్ హైదరాబాద్ వారు మంగళవారం రాత్రి ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకోవడమే గాక ఆలోచింపజేసింది. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో లూథరన్ చర్చి సహకారంతో నాటకాన్ని ప్రదర్శించారు. నేటి రాజకీయ నాయకులు వారి బిజీ రాజకీయాలలో వారి స్వప్రయోజనాల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతులు, విగ్రహావిష్కరణలు చేస్తూ అంబేడ్కర్ కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాడని, నిమ్మన జాతుల కోసం రిజర్వేషన్లు తీసుకువచ్చాడని ఏవో రెండు ముక్కలు చెప్పి మమా అనిపిస్తున్న తంతు చూసి అంబేడ్కర్ ఆత్మ ఘోషిస్తున్న సన్నివేశంతో నాటక ప్రదర్శన ప్రారంభమైంది. అంబేడ్కర్ విగ్రహావిష్కర సభకు హాజరైన రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరుకు అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆయన ఆత్మ రూపంలో బయటకు వచ్చి అక్కడి జనంతో తాను రిజర్వేషన్లు తీసుకు వచ్చానని, కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడానని ఈ రాజకీయ నాయకులు తనను అక్కడితోనే ఆపివేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. తాను నిమ్న జాతుల కోసమే కాదని అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు ఇలా ఆనాడు సమాజంలో పీడించబడుతున్న అందరి కోసం పనిచేశానని, తాను చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను తనకు తానే వివరిస్తానని ఆయన ఆత్మ ఘోషించింది. అలా మొదలైన తన ఆత్మ కథ 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శనలో ఒక్కో ఘట్టం ఎంతో అద్భుతంగా కళాకారులు ప్రదర్శించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి దళితులకు హక్కులు సాధించిన సందర్భంలో గాంధీతో జరిగిన చర్చలలో దళితులు హక్కులు పొందడం, గాంధీ ఒప్పు కోకుండా నిరాహార దీక్ష చేపట్టిన సన్నివేశం ప్రేక్షకులను ఆశ్చర్యగొలిపింది. . ప్రదర్శనను తిలకించడానికి సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, ప్రజాసంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు,పట్టణ ప్రముకు లు, ఇతర ప్రజానికం అధిక సంఖ్యలో హాజరయ్యారు.

డ్రెయిన్లు లేని గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు

గాదెవారిపాలెం(క్రోసూరు): డ్రెయిన్స్ లేని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్లు తక్షణమే నిర్మిస్తామని సత్తెనపల్లి ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ పి.వెంకటనారాయణ అన్నారు. బుధవారం మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన గాదెవారిపాలెం గ్రామంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ టెక్నికల్ సిబ్బందితో, ఫీల్డ్ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో మ్యాజిక్ డ్రెయిన్లు చేపట్టిన అన్ని గ్రామాల్లో ఈ నెలాఖరు కల్లా పూర్తిచేయాలని ఆదేశించారు. డ్రెయిన్లు లేని గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు ఒక చక్కటి పరిష్కారమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధిహామీ క్రోసూరు ఏపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

సత్తెనపల్లి: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్-2025 నినాదంతో పట్టణంలోని సుందరయ్య కాలనీలోని క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్(సీటీయూ) పాయింట్‌ను బుధవారం శుభ్రం చేయించారు. ఏడాదికి పైగా సీటీయూ ఉండడంతో సుమారు 23 ట్రక్కులు వ్యర్థాలను తొలగింప చేశారు. అనంతరం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో పురపాలక సంఘ పారిశుద్ధ్య సిబ్బందికి సఫాయిమిత్ర సురక్ష షివిర్ పేరుతో వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 132 మంది పారిశుద్ధ్య కార్మికులకు యూపీహెచ్‌సీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను సరఫరా చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి ఉన్నారు.

సేవా భావాన్ని కలిగి ఉండడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

బెల్లంకొండ: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండడమే జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) లక్ష్యమని బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.కవితాదేవి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేవాభావాన్ని కలిగి ఉండాలంటే వేల రూపాయలు నగదు దానం చేయాల్సిన పని లేదని, మనకు చేతనైన దానిలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలలో పాల్గొంటే సరిపోతుందని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యాపకులు వై.రమేష్ బాబు, డి.ఆదెయ్య, సాంబశివరావు, కుసుమకుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలునాయక్, అంకమ్మ, అరుణ పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు, మండలంలోని బయ్యవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగుదారు హక్కు కార్డును పొంది ఈ-పంట ద్వారా తమ యొక్క పంటను వారి పేరనే నమోదు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో వేణుగోపాల్, రైతు సేవా కేంద్ర సిబ్బంది బయ్యవరం-ఏ స్వర్ణలత, క్రోసూరు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.